**ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**ప్రాంతీయ వార్తలు**

**తేది: 30.03.2026** **సమయం : 13.10 గంటలు**

**ముఖ్యాంశాలు**

1. తెలంగాణ విద్వేష ప్రసంగాలు, విద్వేష నేరాల నివారణ బిల్లు-2026 ను మంత్రి పొన్నం ప్రభాకర్ శాసన సభ లో ప్రవేశపెట్టారు. సమానత్వం, గౌరవం వంటి మౌలిక రాజ్యాంగ విలువలను రక్షించడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశమని మంత్రి చెప్పారు.
2. తెలంగాణ హేట్ స్పీచ్ బిల్లును వ్యతిరేకిస్తున్నామని, రాజకీయ కక్షతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ బిల్లును తీసుకువచ్చిందని బిజెఎల్పీ నాయకుడు మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు.
3. రాష్ట్ర శాసనసభలో కాగ్ నివేదికను ప్రభుత్వం ఈ రోజు ప్రవేశపెట్టింది. బ్యాంకులతో సరైన సమన్వయం, పర్యవేక్షణ లేకపోవడం వల్ల ప్రభుత్వానికి భారీ నష్టం వాటిల్లిందని నివేదికలో పేర్కొంది.
4. తెలంగాణ శాసనమండలిలో బిఆర్ఎస్ సభ్యుల గందరగోళం నేపథ్యంలో సభ నుంచి ఆ పార్టీ సభ్యులను ఈ రోజు అంతా సస్పెన్షన్ చేస్తున్నట్టు ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటించారు.

.....................................................................

**పొన్నం ప్రభాకర్**

తెలంగాణ విద్వేష ప్రసంగాలు, విద్వేష నేరాల నివారణ బిల్లు-2026 ను మంత్రి పొన్నం ప్రభాకర్ శాసన సభ లో ప్రవేశపెట్టారు. గంగా-జమునీ తహజీబ్‌కు నిలయమైన తెలంగాణలో ఇటీవల డిజిటల్, సోషల్ మీడియా వేదికల ద్వారా విద్వేషపూరిత ఘటనలు పెరగడంపై ఆందోళన వ్యక్తం చేశారు. మతం, కులం, జాతి, భాష, లింగ భేదాల ఆధారంగా శత్రుత్వాన్ని

పెంచే ఇటువంటి ప్రసంగాలు సామాజిక సామరస్యానికి మరియు ప్రజా శాంతిభద్రతలకు తీవ్ర హాని కలిగిస్తున్నాయని పొన్నం పేర్కొన్నారు. సమానత్వం, గౌరవం వంటి మౌలిక రాజ్యాంగ విలువలను రక్షించడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశమని వివరించారు. ఈ విద్వేష నేరాలు సమాజంలో అసమ్మతిని ప్రోత్సహిస్తున్నాయని, వీటిని అరికట్టడం ద్వారానే రాష్ట్ర పౌరులందరికీ భద్రత కల్పించవచ్చని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

**Byte : Ponnam Prabhankar**

**..........డెస్క్**

**బిజెపి హేట్ స్పీచ్ బిల్లు వ్యతిరేకం**

తెలంగాణ విద్వేష ప్రసంగాలు, విద్వేష నేరాల నివారణ బిల్లు-2026 ను బిజెపి అసెంబ్లీలో వ్యతిరేకించింది. ఈ మేరకు బిజెఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... రాజకీయ కక్షతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ బిల్లును ప్రవేశపెట్టిందని ఆరోపించారు. నేరం రుజువు కాకుండానే జైలుకు పంపిస్తారని ప్రశ్నించారు. మరో నేత పాయల్ శంకర్ మాట్లాడుతూ... ఈ బిల్లు ప్రజాస్వామ్యానికి హానికరమని తక్షణమే ఈ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సోషల్ మీడియా ను అణచివేసేందుకు ఈ బిల్లును తీసుకువచ్చినట్టు విమర్శించారు.

.....డెస్క్

**రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పరిధి తిప్పాపూర్ లోని వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి సంబంధించిన తిప్పాపూర్ లోని గోశాలలో కోడెలను, ఏప్రిల్ 7న పంపిణీ చేయనున్నట్లు రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ ఒక ప్రకటనలో తెలిపారు. వేములవాడ తిప్పాపూర్ గోశాలలోని మధ్యస్థం నుంచి పెద్దగా ఉన్న 300 కోడెలు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాతో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లా, పరిసర జిల్లాల రైతులు అర్హులని స్పష్టం చేశారు. కోడెల కోసం 1.5 నుంచి 5 ఎకరాల వరకు సాగు భూమి ఉన్న సన్నకారు, చిన్నకారు రైతులు అర్హులని, వారు వెబ్ సైట్ లో దరఖాస్తు

చేసుకోవాలని సూచించారు. అర్హులైన రైతులు పట్టాదారు పాస్ బుక్, తమ సమీప మండల వ్యవసాయ అధికారి/ ఏఈఓ నుంచి ధ్రువపత్రం, ఆధార్ కార్డ్ మొదలగు సంబంధిత ధ్రువ పత్రాలతో ఈ వెబ్సైట్ https://rajannasircilla.telangana.gov.in/ లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న రైతులు దానికి సంబంధించిన పత్రాలతో వచ్చే నెల 7వ తేదీన ఉదయం 07.00 గంటలకు వేములవాడ పరిధిలోని తిప్పాపూర్ గోశాలకు కోడెల కోసం రావాలని తెలిపారు. అర్హులైన రైతులకు మాత్రమే జియో ట్యాగింగ్ కలిగి ఉన్న కోడెలను పంపిణీ చేయనున్నామని కలెక్టర్ పేర్కొన్నారు.

......పిటిసి, రాజన్న సిరిసిల్లా

**నేషనల్ గ్రీన్ కార్ప్స్**

తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా చామనపల్లి గ్రామంలో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై క్షేత్ర స్థాయి అవగాహనా పర్యటన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం జిల్లా స్వచ్ఛ భారత్ మిషన్ జిల్లా కో ఆర్డినేటర్ టి.రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించగా తెలంగాణ గ్రీన్ కార్ప్స్ రాష్ట్ర కో ఆర్డినేటర్ surya కిరణ్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఘన వ్యర్థాల వేరు చేయు విధానంపై ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని, విద్యార్థులకు అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యంగా ప్లాస్టిక్ వేస్ట్ ను వినియోగించవద్దని సూచించారు. అధికంగా వాడటం వలన కలిగే అనర్థాలను వివరించారు. తడి చెత్త పొడి చెత్త సేంద్రియ ఎరువులు హానికర పదార్థాలు వేరు వేరుగా చేసి చూపించారు. ఈ కార్యక్రమం లో చామనపల్లి గ్రామ సెక్రటరీ మహేందర్, కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళశాల విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు, పాల్గొన్నారు.

......పిటిసి, కరీంనగర్

**హజ్ కమిటీ**

తెలంగాణ రాష్ట్ర హజ్ కమిటీ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా నుంచి హజ్ యాత్రకు వెళ్లే యాత్రికుల ఆరోగ్య రక్షణకు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా హజ్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో వ్యాక్సినేషన్ నిర్వహించారు. ఐఎంఏ హాల్‌లో నిర్వహించిన వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఇవాళ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ముఖ్య అతిథిగా హాజరై... ప్రారంభించారు. యాత్రికులు ఆరోగ్యంగా, సురక్షితంగా హజ్ ప్రయాణాన్ని పూర్తి చేసుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. డిఎం హెచ్ఓ డాక్టర్ సాంబశివరావు,జిల్లా హజ్ సొసైటీ అధ్యక్షులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

.........పిటిసి, వరంగల్

**కాగ్ నివేదిక**

రాష్ట్ర శాసనసభలో ప్రభుత్వం కాగ్ నివేదికను ప్రవేశపెట్టింది. మార్చి 2022తో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి సంబంధించి.. సామాజిక, ఆర్థిక, సాధారణ రంగాలతో పాటు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమంపై కాగ్ కీలక అంశాలను వెల్లడించింది. ప్రభుత్వ నిర్వహణ లోపాల కారణంగా కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా అయ్యిందని నివేదికలో స్పష్టం చేసింది. ముఖ్యంగా బడ్జెట్ రూపకల్పనలో తీవ్ర వ్యత్యాసాలు ఉన్నాయని కాగ్ పేర్కొంది. 2021-22 ఆర్థిక సంవత్సరంలో నిధుల కేటాయింపులు, వాస్తవ రాబడుల మధ్య ఏకంగా 53 శాతం వ్యత్యాసం ఉందని పేర్కొంది. అలాగే 2019-20, 2020-21 బడ్జెట్ నిర్వహణ కూడా సక్రమంగా లేదని విమర్శించింది. బ్యాంకులతో సరైన సమన్వయం, పర్యవేక్షణ లేకపోవడం వల్ల ప్రభుత్వానికి భారీ నష్టం వాటిల్లిందని నివేదిక పేర్కొంది. 2023 నాటికి చెక్కులు, డ్రాఫ్టులను సకాలంలో జమ చేయనందున సుమారు 52 కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందని కాగ్ వివరించింది.

......పిటిసి, హైదరాబాద్

**సలేశ్వరం యాత్ర**

నాగర్ కర్నూల్ జిల్లాలోని నల్లమల అటవీ ప్రాంతంలో కొలువైన సలేశ్వరం లింగమయ్య క్షేత్ర దర్శనానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. సాహసయాత్రగా పేరొందిన ఈ క్షేత్ర సందర్శన ఏప్రిల్ 1 నుంచి 3వ తేదీ వరకు మూడు రోజుల పాటు జరుగుతుంది. ఇందులో భాగంగా నల్లమల అటవీప్రాంతం అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలోని సలేశ్వరం లింగమయ్యను దర్శించుకునేందుకు సుమారు 4 కిలోమీటర్ల దూరం ఎత్తయిన కొండలు, లోయల్లో కొలువైన లింగమయ్యను కాలినడకన చేరుకుంటారు. హైదరాబాద్ - శ్రీశైలం రహదారిలోని ఫరహాబాద్ గేట్ నుంచి వాహనాలను అనుమతించనున్నారు. ఈ మూడు రోజుల పాటు నాగర్‌కర్నూల్, అచ్చంపేట ఆర్టీసీ ప్రత్యేకంగా బస్సులను నడపనుంది. ఇలాంటి విశిష్టత కలిగిన క్షేత్ర దర్శనానికి తెలంగాణతో పాటు ఏపీ, కర్నాటక నుంచి కూడా వేలాదిమంది భక్తులు తరలివస్తారు. యాత్ర సందర్భంగా ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, భద్రతను ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాదావత్ సంతోష్ సలేశ్వరం యాత్ర ఏర్పాట్లపై మీడియా సమావేశంలో మాట్లాడారు. ఏప్రిల్ 1 నుంచి జరిగే సలేశ్వరం జాతరకు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు.

**బైట్ బాదావత్ సంతోష్, కలెక్టర్ నాగర్ కర్నూల్ జిల్లా**

.....పిటిసి, నాగర్ కర్నూల్

**శాసనమండలి గందరగోళం**

తెలంగాణ శాసనమండలి సమావేశాల్లో గందరగోళం నెలకొంది. 'రాఘువ కన్‌స్ట్రక్షన్' సంస్థపై వస్తున్న అవినీతి ఆరోపణలే లక్ష్యంగా ప్రతిపక్ష బీఆర్ఎస్ సభ్యులు సభలో ఆందోళనకు దిగారు. సభ ప్రారంభమైన వెంటనే ఈ అంశాన్ని లేవనెత్తిన ఎమ్మెల్సీలు, సదరు సంస్థపై హౌజ్ కమిటీ వేయాలని, పొంగులేటిని వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్

చేశారు. ప్లకార్డులు పట్టుకుని పోడియం వద్దకు దూసుకెళ్లి నినాదాలు చేయడంతో సభలో గందరగోళం నెలకొంది. సభ్యులు సభా నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసిన చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, వారిని నియంత్రించడం సాధ్యం కాకపోవడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలను ఈ రోజంతా సభ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం మార్షల్స్ సస్పెండ్ అయిన సభ్యులను సభా ప్రాంగణం నుంచి బయటకు పంపించేశారు.

.....పిటిసి, హైదరాబాద్

**శ్రీధర్ బాబు**

బీఆర్ఎస్ సభ్యుల తీరుపై శాసనసభాపక్ష వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. చైర్మన్ పదేపదే అప్పీల్ చేస్తున్నా వినకుండా, సభ సజావుగా సాగకుండా అడ్డుతగలడం సరికాదని సీరియస్ అయ్యారు. ప్రతిపక్షం ఉద్దేశపూర్వక గందరగోళం సృష్టిస్తోందని  మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

.......పిటిసి, హైదరాబాద్

**నల్లగొండ – బడ్జెట్**

నల్లగొండ నగర అభివృద్ధికి  281.46 కోట్ల రూపాయల భారీ బడ్జెట్  ప్రవేశ పెట్టమని కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.  ఇందులో 203.01 కోట్ల రూపాయలు  కేంద్ర-రాష్ట్ర నిధులు ఉన్నాయని వెల్లడించారు. స్పెషల్ గ్రేడ్  మున్సిపాలిటీ  నుంచి కార్పొరేషన్ గా మారిన తరువాత నల్లగొండకు ప్రవేశ పెట్టిన తొలి బడ్జెట్ కావడంతో ఎక్కువగా మౌలిక వసతులు,  అభివృద్ధి పనులపై దృష్టి సారించామని అన్నారు.  మౌలిక వసతులకు పెద్దపీట వేస్తూనే, మురికివాడలు,  బలహీన వర్గాల పై  ప్రత్యేక దృష్టి పెట్టామని, ఇందులో పన్నుల కన్నా కేంద్ర ప్రభుత్వ గ్రాంట్లే ఎక్కువగా ఉన్నాయని తెలిపారు.  కేంద్ర ప్రభుత్వ గ్రాంట్ల రూపంలో 203.01కోట్ల రూపాయలు  వస్తుండగా, మిగిలిన నిధులు ఆస్తి పన్నులు, లైసెన్సులు, వివిధ రకాల ప్రభుత్వ పథకాల ద్వారా వస్తాయని తెలిపారు.. పారిశుద్ధ్యం, తాగునీరు, హరితహారం — నగరానికి మూడు స్తంభాలు గా ఉన్నాయని

పేర్కొంటూ, పార్కులు, మార్కెట్లు, పార్కింగ్ వంటి సౌకర్యాల ద్వారా నగరానికి కొత్త రూపం వస్తుందని తెలిపారు. ఈ అభివృద్ధి పనుల్లో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

.......పిటిసి, నల్లగొండ

**ఓపెన్ పది, ఇంటర్ పరీక్షలు**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఓపెన్ పది, ఇంటర్ పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ లో ఓపెన్ పది, ఇంటర్ పరీక్షల ఏర్పాట్ల పై సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఏప్రిల్ 20 నుంచి 27 వరకు పరీక్షలు జరగనున్నాయన్నారు. పరీక్షల నిర్వహణకు సిరిసిల్లలో 3, వేములవాడలో 2 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 28 నుంచి మే 5వ తేదీ వరకు జరిగే ప్రాక్టికల్ ఎగ్జామ్స్ కు ఒక పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

...........పిటిసి, రాజన్న సిరిసిల్ల జిల్లా

**కెటిఆర్ – పొంగులేటి**

రంగారెడ్డి జిల్లా వట్టినాగులపల్లిలో 1400 కోట్ల రూపాయల విలువ చేసే భూమిపై పొంగులేటి కన్ను పడిందని ఆ భూ యజమానుల ఇంటికి వెళ్లి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి కుమారుడు హర్ష బెదిరించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. వట్టినాగులపల్లిలో పొంగులేటి కుమారుడు కబ్జాకు యత్నించారని ఆరోపణలు ఉన్న భూమిని ఇవాళ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి కేటీఆర్ పరిశీలించారు. ఈ సందర్భంగా భూ యజమానులతో కలిసి మీడియాతో మాట్లాడిన కేటీఆర్.. ఈ భూమిని తన సొంతం చేసుకునేందుకు మంత్రి స్వయంగా బెదిరించడంతో పాటు అధికారుల ద్వారా బెదిరింపులకు పాల్పడ్డారని ఆరోపించారు. రాష్ట్రంలో పోలీస్ స్టేషన్లు లేవు అనేలా పొంగులేటి ప్రవర్తిస్తున్నారని,

అయన  భూకబ్జాలపై వద్దకు గవర్నర్ కు ఫిర్యాదు చేస్తామన్నారు. త్వరలో మరిన్ని కుంభకోణాలను బయటపెడతామని తెలిపారు.

.....డెస్క్

**ఎలివేటెడ్  కారిడార్**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధిలోని ఉప్పల్ నుంచి నారపల్లి వరకు నిర్మాణంలో ఉన్న ఎలివేటెడ్  కారిడార్ కు బండారి రాజిరెడ్డి కారిడార్'గా నామకరణం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉప్పల్ నియోజకవర్గ తొలి శాసనసభ్యుడిగా, కాప్రా మున్సిపాలిటీ తొలి చైర్మన్ గా విశేష సేవలు అందించిన దివంగత  బండారి రాజిరెడ్డి  పేరు ఉప్పల్ కారిడార్ కు పెట్టాలని ప్రజల నుంచి అందిన విజ్ఞప్తుల నేపథ్యంలో మల్కాజిగిరి నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఈ ప్రతిపాదనను ఫిబ్రవరి 9న ఆమోదించి ప్రభుత్వానికి పంపింది.ఈమేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ ఉత్తర్వులు జారీ చేశారు. మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ తదుపరి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

........డెస్క్

**వాతావరణం**

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా రానున్న నాలుగు రోజుల్లో వాతావరణం పెద్దగా మార్పు ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది.  అక్కడక్కడ తేలికపాటి నుంచి  ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వెల్లడించింది. రాష్ట్రంలోని గరిష్ట ఉష్ణోగ్రతలు పెద్దగా మార్పు లేకుండా ఇంచుమించు ఇదే స్థాయిలో కొనసాగవచ్చని... అయితే వర్షాలతో పాటు ఉరుములు, మెరుపులు సంభవించే అవకాశం ఉందని వివరించింది.

.......పీఎన్